# పాపం! దేవుడు : పాపం! డాక్టరు

– డా|| కేతు బుచ్చిరెడ్డి

"సారూ!" తలుపు దగ్గర శబ్దం.

"ఎవరూ?" వేళాపాళా లేకుండా వచ్చి నిద్ర చెడగొట్టినందుకు విసుక్కున్నాడు నా లోని మామ (మామూలు మనిషి).

"ఎవరో పాపం!" అని సానుభూతిగా అనుకున్నాడు నాలోని రచయిత.

విద్యుక్త ధర్మానికి నిద్ర, వేళాపాళా లేదనుకొన్నాను నేను.

హాస్పిటలు నుండి వచ్చి భోంచేసి, ఈజీ చెయిర్లో అప్పుడే కన్నంటాను. ప్రొద్దుటినుండి రోగులను చూడడంలోనే గడిచింది. సమయం మధ్యాహ్నం 3.30 గంటలు. కాసేపు రెస్టు తీసుకుందామను కున్నాను. కుదర్లేదు.

"సంప్రదించు వేళలు– సాయంత్రం 6 నుండి 8గం||ల వరకు" అన్న బోర్డు వేసినా, చదువుకోకుండా, కొంపలు మునిగినట్లు ఎపుడు పడితే అపుడు వస్తారు" మండిపడ్డాడు నాలోని మామ.

"నిరక్షరాస్యతా రాక్షస విముక్తి మన దేశానికి ఎప్పుడో?!" నాలోని రచయిత నిట్టూర్చాడు, బయట నిలుచున్న పల్లెటూరి వ్యక్తిని కిటికీలోంచి చూస్తూ.

"ఆఫీసుకు వేళలుంటాయి. ఆస్పత్రికి, రోగాలకి, డాక్టర్లకేమిటి వేళలు? సమయం, సందర్భమని, పండుగలని చూసి రోగాలు వస్తాయా ఏం?" అనుకుంటూ తలుపు తీశాను.

"డాకటేరు తమరేనా? చూపు సరిగా ఆనడంలేదు", క్షమాపణ అడిగాడాయన, "ఏం అట్లా కనిపించటం లేదా?" జోకేశాడు నాలోని రచయిత– అడ్డపంచె బనియనుతో నిద్రమొహంతో ఉన్న నన్ను చూసి.

'అవున'న్నాను.

"నాలుగేండ్ల కిందటొక సారి నాకు కడుపునొప్పి వస్తే తమరే మంచిమందిచ్చి బాగుచేసినారు. ఒక రోజులోనే నయమయినాది. అందుకే మీకు సూచిచ్చాలని మా బుడ్డోన్ని తెచ్చినా?" అన్నాడు ఆగంతకుడు.

"బుడ్డోడు ముద్దుపేరేమో?!" విట్టేశాడు నాలోని మామ.

"పరిచయం బాగుంది" అనుకున్నాడు నాలోని రచయిత.

తల్లీ, తండ్రి బుడ్డోన్ని కూర్చోమని చెప్పాను. 'ఫర్వాలేదు సారూ!' అంటూ అతను, "మాకెందుకయ్యా కుర్చీలు', అంటూనే ఆమె, కూర్చున్నారు. బుడ్డోడు ఏం మాట్లాడకుండానే, నా మాటకంటే ముందుగానే, అలా అలిసి పోయినట్లు, కుర్చీలు తనకోసమే వేసినట్లు, కూచున్నాడు.

లోనికిపోయి, ముఖం కడుక్కొని, డ్రెస్ మార్చు కున్నాను. సిరెంజ్‌ని మరగకాచి తీసుకొచ్చాను.

నా టేబుల్ దగ్గర కూర్చున్నాను.

'వ్యాపారస్తుడు కొట్లో కూచున్నట్లు, మనసు కుదురుగా పెట్టుకొని కూచో! దయాదాక్షిణ్యాలను గుండెలోనే దాచుకో, పైకి నకబరిస్తే పైసలు రాలవు. తర్వాత నీ ఇష్టం" నాలోని మామ హెచ్చరించాడు.

"రోగుల సేవకు నీ జీవితం అంకితం చెయ్" ప్రబోధించాడు నాలోని రచయిత.

"రోగి మతం, కులం, అంతస్తు, హోదా, అభిప్రాయాలు, ఆలోచనలు వదిలేసి రోగిగా అతని బాధేమిటో కనుక్కోవటం, చికిత్స చేయటం డాక్టరు ధర్మం" అన్న విలియం ఆస్లర్ వైద్య మహానుభావుడి పలుకులు గుర్తుకు తెచ్చుకొని, "ఏం నాయనా! నీ బాధేమిటి?" అని అడిగాను.

సమాధానం చెప్పలేదా కుర్రాడు. పద్నాలుగు పదహైదేళ్ళ వయస్సుంటుందేమో. తలకొంచెం చిన్నగా ఉంది. ముఖంలో కళలేదు. వెర్రిచూపులు చూస్తున్నాడు. నోరు తెరుచుకొని నావైపు

చూస్తున్నాడు. కారే చొల్లును తుడుచుకుందామనే ధ్యాసకూడా లేకుండా, ఒళ్ళంతా చెమట. నిక్కరులేదు. గళ్ళడ్రాయరు వేసుకున్నాడు. బనియన్ లేదు. చిరుగులు పడ్డ చొక్కా మాత్రం వేసుకున్నాడు.

ఆమె దత్తాపురం నేత చీరకట్టుకొని, సైను రవిక తొడుక్కుంది. అతను ముతక ఖద్దరు పంచె, ఇస్త్రీలేని, గుండీల్లేని ఆ పారం చొక్కా వేసుకున్నాడు.

ముగ్గుర్లో ఎవరికీ కాళ్ళకి చెప్పుల్లేవు. ఆయన రెండు కాళ్ళు కుర్చీలో పెట్టి కూచున్నాడు. ఆమె ఒక కాలు కుర్చీమీద, రెండో కాలు నేలమీద పెట్టి కూచుంది. నోట్లోకి చారెడు కట్టెల పొడి గబుక్కున బొక్కింది. అతని చెవిలో సగం కాల్చి దాచుకున్న బీడీ ముక్క ఉంది.

"పేదరికం - అజ్ఞానం- అవిద్య" వాళ్లలో త్రిమూర్తులుగా సాక్షాత్కరిస్తున్నాయి. "మాటచేత, మనసు చేత, చేతచేత' త్రికరణ శుద్ధిగా వీళ్ళు సగటు భారతీయ పౌరుల్ని తలపిస్తున్నారు" అని రచయిత విలపించాడు.

'కొందరు పైకి పేదవాళ్ళలాగ కనిపిస్తారు. డబ్బు దండిగానే ఉంటుంది. కాకపోతే శుచి శుభ్రత, అనుభవించటం తెలీదు', అనుమానించాడు నాలోని మామ. తనెప్పుడో బస్సు ప్రయాణం చేస్తుండగా, టికెట్టు కొట్టిన తర్వాత సగం డబ్బులే ఇస్తానని మొరాయించిన పల్లెటూరి ముసలాయన సంచి సోదా చేస్తే వందరూపాయల నోట్లకట్టలు దొరికాయని, తన అనుభవాన్ని మరీ గుర్తుచేసాడు మామ.

"వట్టి అంబేదకుడు సారూ. పనిపాటలు చేసుకునే తెలివితేటల్లేవు. అప్పుడప్పుడు ఉన్నట్లుండి

> **హత్య**
>
> ఆకలి
> సునామీ
> కలివ్వాలు
> ఎక్కేశాయి....
> ఇక రావాల్సింది
> కువ్యల కల్పితం
>
> – జిజికె రావు

ఎవరో 'తోనినట్లుంటాది, గుండె పట్టుకుంటున్నట్లుంటాదని అరిచి, గుడ్లు తేలేసి ఏ కంపలోనో, గుంతలోనో పడిపోతాడు. పని తప్పించు కుంటే దానికి ఎత్తులు ఏసినాడని సితక తన్నేవాడ్ని, వాతలు పెట్టిచ్చినా, మంత్రాలు, తంత్రాలు సేపిచ్చినా, ఏం చేసినా లాబంలేకుండా ఉంటాది... ఏదన్నాగాని సేప్టఅయి వుండచ్చునా సారూ!" అన్నాడా పల్లెటూరి ముసలాయన.

"భూత వైద్యుణ్ణిగాదు నాయనా. మామూలు వైద్యుల్లో, డాక్టర్ను' వ్యంగ్యంగా అన్నాడు నాలోని మామ.

"ప్రజల్లో ఈ అజ్ఞానం, అనాచారాలు, మూఢనమ్మకాలు ఎప్పుడు పోతాయో?" పిడికిలి బిగించి, గట్టిగా శ్వాస పీల్చి వదిలి, ముఖంపైకెత్తి, శూన్యంలోకి చూశాడు నాలోని రచయిత.

"గాలిచేష్ట కాదు లెండి. జబ్బులక్షణాలే," అన్నాను.

"ఏమోసారూ, తమరే దేవుడు మాకు, దేవుడు ఏడుండాదో తెల్దు. ఎప్పుడూ ఎవరూ సూల్లేదు. సూసినామంటే అల్ల పైతికం సే స్టాలే. ఎదురుగా ఉండే దేవుడు నువ్వే. నాకు బాగాసేసినట్లే మా బుడ్డోడికి బాగా సెయ్. నీ అస్తగునం మాంచిది సల్లసెయ్యి. దరమ పెబువులు", అన్నాడా పిల్లాడి తండ్రి.

"పొగడరా పొగుడు. ఇంతకూ పైసలు రాలేట్టు లేవు," అనుకున్నాడు నాలోని మామ.

"కొందరి పొగడ్త అగడ్తలాంటిది. పడిపోకుండా చూసుకో

కొందరి పొగడ్త అగరొత్తుల పొగ-పొగరెక్కిస్తుంది

మిత్రుడి పొగడ్త కన్న శత్రువు తెగడ్త మేలు చేస్తుంది.

మల్లెపూవు మెత్తదనం - పరిమళంలా పొగడ్త మనిషికి మత్తెక్కిస్తుంది"

– నాలోని రచయిత గేయం రాసుకుపోతున్నాడు.

"పదకొండు మంది తర్వాత పన్నెండో వాడు వీడు. సచ్చినోడు కాదు బతికినోడుకాదు.

మంత్రాలకు, అంత్రాలకు ఆ వూరు ఈ ఊరు తిరిగి శానా కర్సునేసుకున్నాం", అన్నదా మాతృశ్రీ.

"ఊళ్ళో వాల్లందరూ పేటకు పోయి డాకటేరుకు సూపిచ్చుగూడదా అంటారు. కుంటికి గుడ్డకు సరిగా టికానా లేనోల్లం. రోగాలకు రూకలు యాడనించి తెచ్చేది', అన్నాడా పితృశ్రీ.

"పిల్లలెక్కువయితే కన్న వాళ్ళప్రేమలు కూడా పల్చబడి చల్లబడుతాయి. పేదరికానికి ప్రేమలు, అనురాగాలు ఖరీదైన విషయాలు, అందని ఆకాశంలో చుక్కలు. ఈ దేశానికి కుటుంబనియంత్రణ ఒక్కటే శరణ్యం," నాలోని రచయిత ఆవేశం పొందుతున్నాడు.

'ఇదేదో ఎఫ్.ఎస్.కేసులాగుందే, ముందే ఫీజు చెప్పేస్తే బాగుంటుంది. తర్వాత నీ ఇష్టం", నాలోని మామ ఉచిత సలహా ఇచ్చాడు.

"ముందుగా బేరం చేసుకుంటే అది వ్యాపారం అవుతుంది. వైద్యుడు రోగం నయం చేసి, రోగి కృతజ్ఞతతో, సంతోషంతో ఇచ్చింది మాత్రమే పుచ్చుకోవాలి. అది వైద్య ధర్మం", నాలోని రచయిత ధర్మోపదేశం.

"బోటు ఎక్కేవరకు బోటు మల్లయ్య, బోటు దిగిన తర్వాత బోడి మల్లయ్య, అంటుందీ లోకం. ధర్మం నాలుగు పాదాల నడిచే కాలం కాదు. రోజులు మారాయి'', నాలోని మామ తన లోకజ్ఞతను చాటాడు.

వీళ్ళనిలా సాగనిస్తేనా కథ సాగదు, ఈదినం రోగుల్ని చూడ్డం కుదరదనుకొని, నాలోని మామను, రచయితను నోళ్లు మూయించి, రోగిని బల్లపై పడుకోమని, తండ్రిని ప్రక్కనుండి విషయాలన్నీ చెప్పమన్నాను. కర్టెన్‌వేసి, రోగిని పరీక్ష చేయటం మొదలుపెట్టాను.

పరీక్షానంతరం తలిదండ్రులకు జబ్బు విషయం చెప్పాను. వేరే ఎక్కడికీ తీసుకుపోయే శక్తి, స్తోమత లేదని, నన్నే వైద్యం చేయమన్నారు. నేను సరే నన్నాను.

రోగికి ఇంజక్షనిచ్చాను. మాత్రలు ఎలా వాడాలో చెప్పి, తండ్రి చేతిలో పెట్టాను.

"ఫీజు అడుగు", నాలోని మామ తొందర చేస్తున్నాడు. ఇస్తార్లే ఎక్కడికి పోతారనుకున్నాను.

"అడుగు... అడుగు.... అడుగు", నాలోని మామ ఒత్తిడి ఎక్కువైంది.

"సర్లే అడుగు. వైద్యం చేసిన తర్వాత ఫీజు అడిగితే ఫర్వాలేదు. వైద్యం వ్యాపారస్థాయికి దిగ జారుతున్న ఈ రోజుల్లో," నాలోని రచయిత సర్దుబాటు చేస్తున్నారు.

ఫీజు అడిగాను.

తండ్రి నీళ్ళు నములుతున్నాడు. డబ్బు దస్కం తనకు సంబంధం లేనట్లు తల్లి బయటికి నడిచింది, వక్కాకు ఉవ్మేయడానికన్నట్లు. బుడ్డోడు ఇంజక్షనిచ్చిన చోట చేత్తో రుద్దుకుంటున్నాడు.

"ఒట్టి సేతుల్తో వచ్చినాము, ఇంకోపాలి వచ్చినప్పుడు ఇస్తాం. మీ మేలు మర్సిపోతామా", అన్నాడు ముసలాయన.

వెళ్లడానికి సిద్ధమయ్యారు.

ఇంతలో రోగి బొళుక్కున వాంతి చేసుకున్నాడు. ఒళ్ళంతా చెమట పట్టింది. రొప్పుతున్నాడు. కూర్చున్న చోటునుంచి వాలిపోయి నేల మీద కొరిగాడు.

పరీక్షించాను. నాడి సరిగ్గా అందడంలేదు. స్టెతస్కోపు ఛాతీపై పెట్టాను. గుండె నీరసంగా కొట్టుకొంటోంది. స్టెతస్కోపు పెట్టుకున్నా నా గుండెదడ దడలు నాకే వినిపిస్తున్నాయి.

"ఇంజక్షన్ రియాక్షన్. వెంటనే విరుగుడు మందులు వాడాల, పక్కనే మందుల షాపు వుంది, తెచ్చు కుంటారా? అయినా వాళ్లదగ్గర డబ్బేం లేదంటున్నారు గదా పాపం"! మాటలు నా నోటిలో ఉండ గానే-

"ఏం సారూ! ఏమైంది ఇంజీసనిస్తానే ఇట్లా

### కవి

**త**న కన్నీళ్ళను
ఆనంద బాష్పాలుగా మార్చుకొని
అవతల వారి కష్టాలను చూసి
కన్నీళ్ళు కార్చేవాడు

- వై.కె.మూర్తి

గయినాడే. పొరబాట్న ఒకదానికొకటి ఇచ్చినావా?" తండ్రి ఆందోళన, అనుమానం.

"ఓర్నాయనో! నా కొడుకును సంపేసినాడో! బంగారు లాంటి బిడ్డ! మా కెవరు దిక్కురో దేవుడో! రోజు కూలిసేసి బాగా సంపాయిచ్చకస్తా వుండె," తల్లి రాగాలు.

"శానా తెలివైనోడు సారూ. జతగాల్లు ఎప్పుడు పది మందన్నా వాడి సుట్టూరనే. అందరికీ కులాసా కలిగించేవోడు. మాంచి పయోజకుడు సారూ, మాకు లేకుండా జేసినారే," తండ్రి నా మీద నింద మోపుతున్నాడు.

గబగబ ఎమర్జెన్సీ కిట్‌లోంచి యాంటి హిస్టమన్, అడ్రినలిన్, కార్టిసోన్ ఇంజక్షన్లు ఒకటి తర్వాత ఒకటి కండకు గుచ్చాను.

రోగిని బల్లపై పడుకోబెట్టాను. రోగి చెయ్యిని తండ్రిని పట్టుకోమన్నాను, సెలైన్ ఎక్కిద్దామని.

"ఇంకా పానం ఏడుండాది సారూ. గుడ్లు తేలేసినాడు. ఒల్లంతా సల్లగుండాది. తమరేమన్నా దేవుడా, పోయిన పానం పట్టకరాడానికి," అంటూనే చెయ్యిపట్టుకున్నాడా తండ్రి.

గోలగోలగా తల్లి వీధిలో నెత్తినోరు మొత్తుకుంటోంది. కర్టెన్ కడ్డీకి సెలైన్ బాటిల్ తగిలించి, స్పీడ్‌గా సెలైన్ రక్తనాళం గుండా ఎక్కించాను.

తండ్రి నిరాశతో బయటికి నడిచాడు.

కాసేపట్లోనే వాళ్లిద్దరూ వీధిలోని నాలుగైదు మందిని పోగేసుకొని వచ్చారు.

"కాంపెన్సేషను కట్టాల్సిందే" అని అంటున్నారు వారిలో ఒకరు.

"మీరే ఎంతో ఇప్పించండి నాయనా, నా కొడుకు బంగారు కొండ," అంటోంది తల్లి. "పిల్లనిచ్చి వరదక్షిణ దండిగా ఇస్తామని ఎందరో వస్తావుంటే ఇంకా సిన్నోడని వద్దనుకున్నాం. సదువు సరింగా అంబ్బలేదు కానీ మంచి నౌకరీ సేయాల్సినోడు. ఈనాటికి రుణం తీర్చుకొని పోతున్నాడు. ఆడికోసరం శానా అప్పులు జేసినాను." తండ్రి చెప్పుకు పోతున్నాడు. వచ్చిన పెద్దమనుషుల ముందర ప్రాధేయపడుతున్నాడు.

"అయితే నంమారంగానే లాగాల్సిందే",అంటున్నాడింకో పెద్దమనిషి.

"అన్నీ సెప్పినా, ఆలోసించి మీరే ఎంతో మొత్తం కరారుపర్సండి" తండ్రి ఆరాటం.

"మేం చూస్తాం లేవయ్యా", భరోసా ఇచ్చాడు ఇంకో ఆగంతకుడు. "ఈ దాకటేరుకు సేత గాకపోతే ఏ రాయేలూరుకో, ఇదరాబాదుకో తీసకపోతాంటిమి. మద్దెలోనే మిత్తిమానెత్తిమింద కొట్టేసిందే," తండ్రి చెప్తున్నాడు వాళ్ళతో. ట్రీట్‌మెంట్ ఇస్తున్ననాకు వాళ్ళ మాటలు ఈటెల్లా కర్టెన్‌ను దూసుకొని నా గుండెను గుచ్చుతున్నాయి.

రోగి మెల్లగా కదులుతున్నాడు. కళ్ళుతెరుస్తూ మూస్తున్నాడు. నాడిలో వడి, ఒత్తిడి బాగున్నాయి.

ఇంక మీ పిల్లాణ్ణి తీసుకెళ్ళవచ్చు, బాగున్నాడు", అన్నాను.

'అయ్యా! అమ్మా!" అని అరుస్తున్నాడు బుడ్డోడు కర్టెను వెనకాల.

"ఆఁ!" ఆశ్చర్యపోయారు వచ్చిన వాళ్ళూ, తల్లిదండ్రులతోసహా.

గబగబ వాళ్లు లోనికి వెళ్లారు. కర్టెను తొలగించాను.

"మా అదురుట్టం బాగుంది బతికినాడు పిల్లోడు," అన్నాడు తండ్రి.

"ఆఁ! విరుగుడు మందులివ్వకుండా, కాస్త ఆలస్యమైవుంటే, మీ అదురుట్టం 'బాగుండేది' అన్నాడు నాలోని మామ.

రోగిని చెరొక రెక్క, చెరొకపక్కా పట్టుకొని మెల్లగా నడిపించుకొని వీధిలో పడ్డారు తల్లిదండ్రలిద్దరూ, నా వైపు అదో మాదిరిగా చూస్తూ, పోతున్న వాళ్ళని చూస్తూ నిశ్చేతనగా నిలుచుండిపోయాన్నేను.

"ఫీజు!" మెల్లగా అన్నాడు నాలోని మామ.

"నోర్మూసుకో" అన్నాన్నేను.

దేవుడు దేవుడని పొగిడి నెత్తికెత్తుకున్నాడే ఆ ముసలాయన, కనీసం వెళ్తున్నప్పుడు చెప్పనైనా లేదే అనుకున్నాను.

"పాపం దేవుడు" అన్నాడు నాలోని మామ

"పాపం డాక్టరు" అన్నాడు నాలోని రచయిత. ■